క్లుప్తంగా

కందుల కొనుగోలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు కార్యదర్శి మాధవకృష్ణారెడ్డి

డోన్ రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కందుల కొనుగోలును యార్డు కార్యదర్శి పి. మాధవకృష్ణారెడ్డి ప్రారంభించారు. గిట్టుబాటు ధర పొందేందుకు కందులను శుభ్రపరుచుకొని రావాలని కోరారు. ఎలాంటి రాళ్లు, పుల్లలు ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. టెండర్ పద్ధతిలో క్రయ, విక్రయాలు ఉంటాయన్నారు. కొనుగోలు జరిగిన రోజునే రైతులకు నగదును అందజేస్తామన్నారు. గురువారం రూ.7,529 ధర పలికిందని తెలిపారు. సూపర్‌వైజర్ శివకుమార్‌రెడ్డి, రామాంజినేయులు, మధు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



దెబ్బతిన్న కారు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిలోని మలుపులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్లకు చెందిన సుబ్రమణ్యంకు గాయాలయ్యాయి. స్నేహితుడి కారులో తాడిపత్రి నుంచి కొలిమిగుండ్లకు వస్తున్నారు. అంకిరెడ్డిపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో సుబ్రమణ్యంకు గాయాలయ్యాయి. కారులో ఉన్న మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న సంఘం నాయకులు

డోన్ టౌన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న ఏఈ నాగరాజును గురువారం పలువురు సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమన్నగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు వనం లక్ష్మీదేవి తదితరులు నాగరాజును సత్కరించి అభినందనలు తెలిపారు. తాలూక అధ్యక్షుడు జయమనోజ్, రవికుమార్, సభ్యులు మోహన్, సరోజమ్మ, తదితరులు ఉన్నారు.

వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ రిపేరు మరియు బ్యూటీషియన్స్ (మహిళలు, పురుషులు) కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వ్యక్తిగత, విద్యార్హత వివరాలను శుక్రవారం నుంచి (27 నుంచి 30వ తేదీ)సోమవారం వరకు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సెక్షన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఘనంగా స్వాతివేడుకలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న చెంచు లక్ష్మీ సమేత పావననరసింహస్వామి ఆలయంలో స్వాతివేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు బాలిశెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కోలాహలంగా సుంకులమ్మ జాతర

డోన్ టౌన్: జాతరను పురస్కరించుకుని డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పేరికేటి సుంకులమ్మ దేవాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. కృష్ణమూర్తి కాలనీకి చెందిన మాధవస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

బేతంచెర్ల: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు గురువారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది డిసెంబర్‌లో 17 రోజుల సమ్మె చేశారని..ఆ సమయంలో ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

ఉచిత ‘ప్రయాణం’ ఉత్తిదేనా..!

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు
- డోన్ నియోజకవర్గంలో 90,681 మంది మహిళలు



డోన్ నియోజకవర్గంలో మహిళల వివరాలు

మండలం	సంఖ్య
డోన్	30,101
బేతంచెర్ల	29,235
ప్యాపిలి	31,345

డోన్ రూరల్: ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు. ఎన్నికల సమయంలో సూపర్–6 హామీలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు దాటినా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. సూపర్–6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అటకెక్కించడంపై డోన్ నియోజకవర్గం మహిళలు పెదవి విరుస్తున్నారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సు ల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి నాయకులు.. ప్రస్తుతం దాని గురించి ఏమీ మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఉత్తిదేనా చంద్రాబాబు అంటూ ప్రశ్నిస్తున్నారు. డోన్ నియోజకవర్గంలో 90,681 మంది మహిళలు ఉన్నారు. ఇందులో డోన్ మండలంలో 30,101 వేలు, బేతంచెర్ల–29,235, ప్యాపిలి మండలంలో 31,345 మంది మహిళలు ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ ఎన్నికల సమయంలో కేవలం మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి నాయకులు...ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయకుండా జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని అమలు చేశాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేర ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

–సి.సువర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు, చిన్నమల్కాపురం

గ్రామీణ మహిళలే అధికం



డోన్ మండలంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా..అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి సీఎం పీఠంపై కూర్చున్న తరువాత ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుందంటే ఎలా?. ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

–వై.గంగాదేవి, సర్పంచ్, దొరపల్లి గ్రామం

జాప్యం చేయడం సరికాదు



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. అదిగో..ఇదిగో అంటున్నారే కానీ స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం భావ్యం కాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

–లక్ష్మీదేవి, వెంకటనాయునిపల్లి గ్రామం

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



డోన్: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. శుక్రవారం ఉదయం డోన్ విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టనున్నారు. ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఇంటి నుంచి ఉదయం 9 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు నిరసనగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లెలో వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ఉదయం 9 గంటలకు కాటసాని రామిరెడ్డి ఇంటి వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పెట్రోల్ బంకు కూడలి మీదుగా విద్యుత్‌శాఖ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



సచివాలయం–5లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: గ్రామ సచివాయాల ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని.. లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం–1,2,3,4,5 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాయం నుంచి బయటకు వెళ్లాల్సి వస్తే రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సచివాలయం–5లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సమస్యలను పంచాయతీ కార్యదర్శి హనుక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏదైన సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణాన్ని తిలకించేందుకు హాజరైన మహిళలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కల్యాణ మండపానికి శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న గోవిందమాలధారులు

డోన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవింద మాలాధారులు శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ అధ్వర్యంలో గోదాదేవి, శ్రీదేవి, వేంటేశ్వరున్ని కల్యాణ మండపంలో ఆశీనులను చేశారు. వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాసరావ్ ప్రసాద వితరణ చేశారు. గోవింద మాలాధారులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ శిబిరాన్ని ప్రారంభించారు. గుండె, కంటి జబ్బులకు సంబంధించి నంద్యాల శాంతిరాం ఆస్పత్రి డాక్టర్లు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 10 మంది గుండె సంబంధిత వ్యాధులు, మరో పది మందిని కంటి ఆపరేషన్లకు రెఫర్ చేశారు. ఇద్దరికి అత్యవసరంగా గుండె సంబంధిత సర్జరీలు చేయాల్సి రావడంతో వారిని ప్రత్యేక వాహనం ద్వారా నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి తరలించారు. ఉచితంగా వైద్య చికిత్సలు చేయిస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, కాల్వ నాగేశ్వరరావు, నందయ్య, శిల్పా సుబ్రమణ్యం, కన్నయ్య, సనత్‌కుమార్, సందీప్, చైతన్య, దినేష్, సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, వందన, జ్యోతి, హేమలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి దీక్ష విరమణ



పూర్ణాహుతిలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ, భక్తులు

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న చండీయాగం పూర్ణాహుతితో గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం గ్రామంలోని చెన్నకేశస్వామి ఆలయం నుంచి చౌడేశ్వరిదేవి దీక్ష స్వీకరించిన భక్తులు ఇరుముడులతో ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. ర్యాలీలో అమ్మవారి భక్తిగీతాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులు దీక్షను విరమింపజేశారు. భక్తులకు పీఆర్ బుచ్చి ఓబులరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. పూర్ణాహుతిలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



దీక్ష విమరణ పూజల్లో భక్తులు

తల్లీబిడ్డా ప్రేమానుబంధం



కాలనీవాసులు గోనెసంచి కప్పడంతో చలి నుంచి ఉపశమనం పొందుతున్న లేగదూడ



తల్లి ఆలస్యంగా రావడంతో అలక



కొద్దిసేపటి తర్వాత తల్లి వద్ద పాలు తాగుతున్న దూడ

బేతంచెర్ల బైటిపేట కాలనీలో బుధవారం సాయంత్రం ఓ ఆవు బిడ్డకు జన్మనిచ్చింది. వర్షం పడటంతోనో మరే కారణం చేతనో తల్లి వదిలి వెళ్లిపోయింది. గురువారం ఉదయం చలికి వణుకుతున్న దూడను కాలనీవాసులు చూసి గోనె సంచి కప్పి సపర్యలు చేశారు. చివరకు గురువారం మధ్యాహ్నం తల్లి ఆవు ఆరుచుకుంటూ వచ్చింది. అంత వరకు చలికి వణికిపోతున్న దూడ తల్లి మీద అలిగిందో.. వదిలి వెళ్లిందనే బెంగో తల్లి దగ్గరకు వచ్చినా కదలకుండా మిన్నుకుండిపోయింది. ఆవు దూడను నాలుకతో నిమరగా అలక వీడిన దూడ తల్లి దగ్గరకు వెళ్లి పాలుతాగింది. జంతువులైనా.. మనుషులైనా తల్లి ప్రేమ ఒక్కటే అనేందుకు ఈ దృశ్యం సాక్ష్యం.

–బేతంచెర్ల:

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిలేటి

డోన్ టౌన్: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు మద్దిలేటి, వడ్డే మహరాజ్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని మతాలను సమానంగా చూడాలని రాజ్యాంగం ఇచ్చిన హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రార్థనా స్థలాలు, ఆస్తుల విషయంలో ఇతర మతాలకు స్వేచ్ఛ ఇచ్చిన ప్రభుత్వం హిందూ దేవాలయాలకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ అజమాయిషీ పూర్తిగా తొలగించే వరకు ఉద్యమం ఆగదన్నారు. బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, అశోక్, దామోదర్‌నాయుడు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

బేతంచెర్ల: సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న సీఎస్‌ఐ చర్చిలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యం, కోలాటం, వేషధారణలు ఆకట్టుకున్నాయి. మంచి పనులు చేసే వారిని ఏసు ప్రభువు ఎల్లప్పుడూ రక్షిస్తాడని పాస్టర్ వినోద్ కుమార్ అన్నారు. సంఘం కార్యదర్శి డేవిడ్ రాజు, సభ్యులు జయాకర్, సుధాకర్, మోజేస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం





బనగానపల్లెలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న నాయకులు, డోన్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న మోటారాముడు



బేతంచెర్లలో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె రూరల్: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంత పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలో పార్టీ ఆవిర్భావ(వందేళ్ల) వేడుకలను ఘనంగా నిర్వహించారు. బేతంచర్ల రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. 1925లో కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, శివయ్య, సంజీవులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలో సీపీఐ శత వసంతాల సందర్భంగా పలుచోట్ల జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మోటారాముడు, వరదరాజులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో పార్టీ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, భార్గవ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 1925 నుంచి సీపీఐ దేశ సమైక్యత, సమగ్రత కోసం పోరాటాలు చేస్తోందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, సీపీఐ నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు, సోమన్న, కోదండరాముడు, మధు రామయ్య పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్ జెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచే ప్రభుత్వాలు తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలిచిందన్నారు.నాయకులువెంకటేశ్వర్లు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.